


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

ఆదివారం 26 అక్టోబర్ 2025 - పేజీలు 8


- ఇవన్నీ 'స్త్రీశక్తి' కష్టాలే..!
- ప్రయాణికుల రద్దీతో ప్రతి పాయింట్ వద్ద ఆగని పల్లె వెలుగు బస్సులు
- పెరుగుతున్న స్త్రీ శక్తి కష్టాలు

## నాన్‌స్టాప్‌లుగా మారుతున్న

# పల్లెవెలుగు బస్సులు..!




**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** రాష్ట్రవ్యాప్తంగా 'స్త్రీశక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా అమలు అవుతోంది. ఆగస్టు 15న నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ పథకాన్ని మహిళలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుంటున్నారు. రోజుకు సుమారు 28 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేస్తున్నట్లు ఓ అంచనా. అయితే 'స్త్రీశక్తి' అందుబాటులోకి వచ్చిన తర్వాత సాధారణ ప్రయాణికులకు ఇబ్బందులు ఎక్కువయ్యాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రధానంగా కొందరు ఆర్టీసీ సిబ్బంది తీరు వల్ల పథకం ద్వారా ప్రభుత్వానికి వచ్చిన మంచి పేరు కన్నా చెడ్డ పేరు ఎక్కువగా మూటగట్టుకోవాల్సివస్తోందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీ అయిన మహిళలకు ఉచిత బస్సు పథకంపై సుదీర్ఘ కసరత్తు తర్వాత రాష్ట్రంలో అమలులోకి తీసుకువచ్చారు. రాష్ట్రంలో 11 రకాల బస్సు సర్వీసులు ఉంటే కేవలం ఐదు బస్సు సర్వీసులకు మాత్రమే ఉచితం వర్తిస్తుందని షరతులు విధించారు. ప్రజలు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. ప్రభుత్వం చెప్పినట్లు పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో బస్సు సర్వీసులల్లో 'స్త్రీశక్తి' కింద ఉచితంగా ప్రయాణిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటకలతో పోల్చితే ఏపీలో 'స్త్రీశక్తి'పై పెద్దగా వ్యతిరేక కథనాలు రాలేదు. ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్తలు, అత్యంత దగ్గరగా పర్యవేక్షణ


వివరాలు 2లో...




మా- ఏపి దిలీప్ రాజా

## చిన్న సినిమాలకు 30 శాతం వేతనాలను పెంచలేరు

**తెనాలి, మేజర్ న్యూస్ :** చిన్న సినిమాలకు పనిచేసే సాంకేతికనిపుణులకు వేతనాలను 22.5 శాతం నుండి


2లో


## పోలీస్ ప్రతిష్ఠ కాపాడే విధంగా విధులు నిర్వహించండి



**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందితో సెట్ కాన్ఫరెన్స


2లో


## ప్రకృతి వ్యవసాయ పొలాలను సందర్శించిన.. గ్లోబల్ జీఐఎస్‌టీ బృందం



**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** దుగ్గిరాల మండలంలోని పెదపాలెం గ్రామ సర్పంచ్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్‌కు సంబంధించిన వరి కంపోస్ట్ బ్లాకును, ప్రకృతి వ్యవసాయ పొలాలు, రసాయన పొలాలను. శనివారం జి ఐ ఎస్ టి బృందం పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్యం, ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో రైతు సాధికారిక సంస్థ చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు అద్భుత ఫలితాలను అందజేస్తున్నాయని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ అన్నారు. బృందం చైర్ పర్సన్ సీఈవో పవన్ సుఖదేవ్ గ్లోబల్ అలయన్స్ ఫర్ ఏ సస్టైనబుల్ ప్లానెట్ సెక్రటరీ జనరల్ సత్య ఎస్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. విజయ్ కుమార్ పంటపొలాలను సందర్శించి మాట్లాడుతూ అంతర పంటలు మరియు పంట వ్యర్థాలతో ఆత్యాదన చేయడం వల్ల నీటి నిల్వ శాతం గణనీయంగా పెరగడంతో పాటు భూసారం కూడా మెరుగుపడుతుందన్నారు. ఈ విధానాలు నేల జీవ వర్ణాన్ని పునరుద్ధరించి ప్రకృతి వ్యవసాయం స్థిరత్వాన్ని పెంచుతున్నాయని తెలిపారు .ఈ బృందం పెదపాలెం గ్రామం నకు చెందిన పాటిబండ్ల కృష్ణ ప్రసాద్ సాగు చేస్తున్న వ్యవసాయ పొలాలను పరిశీలించారు. వ్యవసాయ పొలాలలో రైజోషిత్ 95 సెంటీమీటర్ల గా రసాయన పొలాల్లో 70 సెంటీమీటర్లుగా నమోదు అయిందని అన్నారు ప్రకృతి వ్యవసాయ బ్రిక్స్ విలువలు 18గా రసాయన రైతుల పొలాలలో ఐదు గ్రాములు ఉన్నట్లు గమనించారు ప్రకృతి పొలాలలో టెల్లర్స్ సంఖ్య 45 ఉండగా రసాయన పొలాలలో 17 మాత్రమే ఉందని గుర్తించారు. ఈ ఫలితాలు ప్రకృతి విధానాల ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని విజయ్ కుమార్ వివరించారు .నూతక్కి గ్రామంలో 2016 లో నలుగురు రైతులతో ప్రారంభమైన ప్రకృతి ఉద్యమం ప్రస్తుతం గ్రామములోని 92 శాతం మంది రైతులు విధానాన్ని అవలంబిస్తున్నారని తెలిపారు .బృంద సభ్యులు రైతు శ్రీనివాసరెడ్డి. సాగు చేస్తున్న అరటి మరియు పసుపు పంటలను, రామలింగారెడ్డి సాగు చేస్తున్న పసుపు మొక్కజొన్న పిల్లి పెసర ఏ గ్రేడ్ మోడల్ ను పరిశీలించి రైతుల

## నాన్‌స్టాపులుగా మారుతున్న
# పల్లె వెలుగు బస్సులు..!



మొదటి పేజీ తరువాయి

ఉండటం వల్ల ప్రారంభంలో పాజిటివ్ టాక్ వినిపించింది. అయితే, ఇటీవల కాలంలో ప్రభుత్వ పర్యవేక్షణ తగ్గిపోవడంతో 'స్త్రీశక్తి'పై విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకోవడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ బాగా పెరిగిపోయింది. ఆ ప్రకారం సర్వీసులు పెరగకపోవడంతో సిబ్బంది తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అంటున్నారు. దీంతో ఉచిత బస్సుల స్టాపులను సిబ్బంది సొంతంగా తగ్గించేస్తున్నారని అంటున్నారు. నిర్దేశిత స్టాపుల్లో కూడా బస్సులను ఆపకుండా ముందుకు తీసుకుపోతున్నారు. దీంతో ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఎక్కువ సర్వీసులు ఉన్న పల్లెవెలుగు బస్సులు నాన్ స్టాప్ సర్వీసులుగా మారిపోయాయని ప్రయాణికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సు రద్దీగా ఉంటుండటంతో ప్రయాణికులు దిగేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా డ్రైవర్లు తమ ఇష్టం వచ్చిన దగ్గర బస్సులు నిలుపుతున్నారని ఆరోపిస్తున్నారు. అదే సమయంలో గతంలో ఆర్టీసీ బస్సులు అంటే సమయపాలనకు మారుపేరుగా చెప్పేవారు. కానీ, ఇప్పుడు తీవ్రమైన రద్దీ వల్ల గంటలో ముగియాల్సిన ప్రయాణం రెండు గంటలు అవుతోందని అంటున్నారు. 'స్త్రీశక్తి' వల్ల రద్దీ పెరుగుతుందని ప్రభుత్వం ఊహించినా, ఆ మేరకు సర్వీసులు పెంచకపోవడం, అదనపు సిబ్బందిని నియమించకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు విశ్లేషిస్తున్నారు. పథకం ప్రారంభించిన తొలి పది, పదిహేను రోజుల్లో పాజిటివ్ టాక్ రావడంతో ప్రభుత్వం అక్కడితో వదిలేసిందని, ఆ తర్వాత 'స్త్రీశక్తి'పై పర్యవేక్షణ లేకపోవడంతో రెండు నెలలకే వ్యతిరేకత ఎదుర్కొవాల్సివస్తోందని అంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే 'స్త్రీశక్తి' వల్ల ప్రభుత్వంపై ఇతర వర్గాలలో వ్యతిరేకత పెరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు.

## చిన్న సినిమాలకు 30 శాతం వేతనాలను పెంచలేరు

మొదటి పేజీ తరువాయి

30 శాతానికి నిర్మాతలు చెల్లించలేరని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ 24 విభాగాల యూనియన్ వ్యవస్థాపకులు, సినీదర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా రూరల్ మండలం పెదరావూరు ఫిలిం స్టూడియోస్‌లో కళాకారులు, సాంకేతిక నిపుణుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత యూనియన్ నాయకులు మా-ఏపి ప్రతిపాదనలను పునఃపరిశీలించవలసిందిగా కోరారు. చిన్న సినిమాలను ఆదరించాల్సిన ఆవశ్యకత సగటు ప్రేక్షకులకే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రతి కళాకారుడికీ ఉందని ఆయన తెలిపారు. అలాగే కళలను కళాకారులనూ ఆదరించాల్సిన గురుతర భాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇప్పటికే సినీ పరిశ్రమకు వచ్చిన తుఫానులో 5 శాతం మినహా మిగతా చిన్న సినిమాలన్నీ కొట్టుకుపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న సినిమాలకు డిస్ట్రిబ్యూటర్లు ముందుకు రాకపోవడంతో థియేటర్లు ఇవ్వని పరిస్థితిలున్నాయని దిలీప్ రాజా ఆందోళన వ్యక్తం చేశారు. ఒక మాసంలో మూడు వారాలు పెద్ద సినిమాలను ప్రదర్శించి మిగతా ఒక వారంలో రెండు చిన్న సినిమాలను ప్రదర్శించేలా తగుచర్యలు తీసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ను దిలీప్ రాజా కోరారు. అయితే ఆ వారానికి థియేటర్ల యాజమాన్యం నష్టపడకుండా వినోదం పన్ను మినహాయింపు, విద్యుత్ చార్జీల్లో రాయితీ ఇచ్చేలా పరిశీలించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా ఆంధ్రాలోని టెక్నీషియన్లు చిన్న సినిమాల నిర్మాణానికి సహకరించి గతంలో మాదిరిగానే 22.5 శాతం కాల్ షీట్ కు వేతనంగా తీసుకుని ఆంధ్రాలో పనిచేయవలసిందిగా దిలీప్ రాజా మనవి చేశారు. సమావేశంలో నిర్మాత రావూరి సురేష్ బాబు, కళాకారులు టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పొలాలను సందర్శించిన గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ సస్సేన్బిలిటీ బృందం

మొదటి పేజీ తరువాయి

అనుభవాలను విడివిడిగా తెలుసుకున్నారు . ప్రకృతి విధానాలు వలన పంటల నాణ్యత తో పాటు భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని రైతులు వివరించారు. గ్రామంలోని పద్మశ్రీ మహిళా సంఘ సమావేశాల్లో మహిళల పాత్రను బృందం ప్రత్యేకం గా అభినందించింది. సంఘంలోని మహిళలు పరస్పరం సహకరించి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, థీ మాటిక్ లీడ్స్ చంద్రశేఖర్ ,వాణిశ్రీ, స్థానిక రైతులు ,మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## 2011 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఔదార్యం

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:** రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించిన 2011 బ్యాచ్ కానిస్టేబుళ్ళు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. అదే బ్యాచ్ కి చెందిన కానిస్టేబుల్ ఇమ్రాన్ వలి 07.02.2025 న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 2011 బ్యాచ్ కానిస్టేబుళ్లు తమ వంతు సహాయంగా రూ.3,75,000/- మొత్తాన్ని సేకరించినారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో మరణించిన కానిస్టేబుల్ ఇమ్రాన్ వలి సతీమణి మైమూన్ కి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ సహోద్యోగి కుటుంబానికి చేయూతగా ముందుకు వచ్చిన 2011 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఔదార్యం ప్రశంసనీయమని, ఇది పోలీస్ శాఖలో ఉన్న ఐక్యతా భావానికి అద్దం పడుతుందని అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు %జష్ట్ర%. అనంత్, నాగిరెడ్డి, శివప్రసాద్, హుస్సేన్, బాషా, జాన్ సైదాలు తదితరులు పాల్గొన్నారు.

## మాచర్లలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో
# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**మాచర్ల మేజర్ న్యూస్,:** శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల వారి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం 2వ విడత రేపు ఉదయం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. మాచర్ల తహసిల్దార్ కార్యాలయంలో జరుగనున్న ఈ కార్యక్రమం స్వచ్ఛ భారత్ ఉద్యమానికి కొనసాగింపుగా చేపట్టినదని ఆయన చెప్పారు. ప్రతి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి మహిళా సభ్యులు కూడా పాల్గొననున్నారని ఆయన వెల్లడించారు. " రేపు ఉదయం కచ్చితంగా 7 గంటలకు తహసిల్దార్ కార్యాలయానికి విచ్చేయాలని" గోవిందరెడ్డి పిలుపునిచ్చారు.

## మూడు రోజులపాటు పాఠశాలలకు సెలవు

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** మెంథా తుఫాన్ దృష్ట్యా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ దృశ్య ప్రజలు విఐ ప్రయాసలకు వచ్చి పీజీఆర్ఎస్కు రావద్దని కోరారు. మెంథా తుఫాన్ దృష్ట్యా 27, 28,29 - మూడు రోజులు పాఠశాలలకు సెలవులను జిల్లా కలెక్టర్ ప్రకటించారు. తల్లిదండ్రులు చిన్నారులను బయటకు వదలరాదని కోరారు.

# పోలీస్ ప్రతిష్ఠ కాపాడే విధంగా విధులు నిర్వహించండి

మొదటి పేజీ తరువాయి

జరిగింది. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో క్రమశిక్షణ, ధైర్యం, చట్టపరమైన నిబద్ధత అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ లాఠీ మరియు విజిల్ తమతో పాటు ఉంచుకోవాలి. అవసరమైతే చట్టబద్ధంగా ఉపయోగించాలి. విధి నిర్వర్తనలో ఎవరైనా అడ్డంకులు సృష్టించినా, బెదిరింపులకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీస్ యూనిఫాం గౌరవం, అధికారాన్ని కాపాడే విధంగా ధైర్యంగా వ్యవహరించాలి. "నేను ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాను" అని తెలిపారు. గంజాయి, పేకాట, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల కార్యకలాపాల నిర్మూలన పట్ల ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలి. గ్రామాలు, పట్టణాల శివారు ప్రాంతాల్లో ఉన్న పాడుబడిన భవనాలను, వెలిసిన ప్రదేశాలను తనిఖీ చేసి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టాలి. లైటింగ్ ఏర్పాటు చేయించాలి. ఓపెన్ డ్రింకింగ్ వంటి వాటిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, పబ్లిక్ ప్రదేశాల్లో ఇవి జరగకుండా కట్టడి చేయాలి. మహిళల భద్రత కోసం శక్తి టీమ్ చురుకుగా క్షేత్రస్థాయిలో తిరుగుతూ, స్కూల్%-%కాలేజీల వద్ద గస్తీ నిర్వహించి, ఈవ్‌టీజింగ్ అరికట్టేలా చూడాలి. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయించి మహిళా పోలీసుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించడంలో చురుకుగా ఉండాలని సూచించారు. మహిళలపై నేరాల కేసుల్లో దర్యాప్తు 60 రోజులలో పూర్తి చేసి చార్జ్ షీట్లు సమర్పించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ క్రైమ్స్, మహిళల భద్రత, గంజాయి మత్తు వ్యసనాలు, రోడ్డు ప్రమాదాలు, ఆస్తి దొంగతనాలు వంటి నేరాల నిర్మూలనకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామం లేదా వార్డులో తగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటి పనితీరును పర్యవేక్షించాలని, అడాప్షన్ కానిస్టేబుల్ ద్వారా అమలు చేయాలని ఆదేశించారు. నిందితులను అదుపులోకి తీసుకునే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఆయుధాలు ఉంటే స్వాధీనం చేసుకోవాలి. వస్తువుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలి. గంజాయి కేసులు, మహిళలపై నేరాలు, దొంగతనాల్లో అరెస్టైన నిందితుల వేలిముద్రలను సేకరించి భద్రపరచాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను రక్షించేందుకు అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిరంతరం తనిఖీ చేయాలి. ఖైదీలను కోర్టులకు లేదా ఆసుపత్రులకు తరలించే సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ఎవరూ వారి వద్దకు రాకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం దృష్ట్యా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, పోలీస్ అమరవీరుల స్మరణ దినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆసుపత్రులు ముందుకు వచ్చి పోలీస్ సిబ్బందికి మరియు వారి కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నాయని ఎస్పీ తెలిపారు.

**చిన్న కేసుల్లో దర్యాప్తును త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. చార్జ్ షీట్లు వేగంగా దాఖలు చేయడం కాకుండా నిందితులకు శిక్షలు పడే విధంగా చేయడం ద్వారా మాత్రమే పోలీసులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని నిరూపించవచ్చు. అదృశ్యమైన వ్యక్తుల కేసుల్లో, ముఖ్యంగా మహిళలు, బాలికలు అదృశ్యమైన సందర్భాల్లో, వెంటనే నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని ఆదేశించారు.**

# ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించిన పల్నాడు జిల్లా పోలీసులు



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం - 2025 సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా శనివారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఓపెన్ హౌస్ పోలీసులు విధి నిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణ కొరకు ఉపయోగించే సాధనాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపీఎస్ ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించినారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ,నేర నియంత్రణ మరియు నేర దర్యాప్తులో ఉపయోగించే ఆయుధాలు,సాంకేతిక పరికరాల గురించి విద్యార్థిని - విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టడం సంతోషకరమని తెలిపారు విద్యార్థిని - విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు అసాంఘిక శక్తుల అణచివేతలో,శాంతి భద్రతల పరిరక్షణలో,నేర నియంత్రణ మరియు నేర దర్యాప్తులో పోలీసు వారు తీసుకునే చర్యల గురించి వివరించడమే ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని ఎస్పీ తెలిపారు ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమము నిర్వహించడం వలన సమాజ శ్రేయస్సు కొరకు పోలీస్ వారు నిర్వర్తించే విధులు గురించి విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన ఏర్పడి,దీని ద్వారా ప్రేరణ పొంది,తద్వారా యువత పోలీస్ శాఖ మరియు ఇతర భారత బలగాల లో సేవలందించడానికి ముందుకు రావడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమానికి హాజరుఅయిన విద్యార్థులను ఉద్దేశించి పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ముఖ్యంగా కొన్ని సూచనలు చేశారు మహిళలను గౌరవించడం మన ధర్మం. భారతీయ సంస్కృతి. కొన్ని సోషల్ మీడియా వెబ్సైట్స్ నందు మహిళలకు సంబంధించి ఇబ్బందికర వీడియోలు అప్లోడ్ చేస్తూ ఉంటారు. వాటిని మీరు గమనించకూడదు పోలీసు జాగిలాలు విధి నిర్వహణలో భాగంగా ప్రేలుడు పదార్థాలను వాసన చేస్తే జాగిలం తాలూకు ఊపిరితిత్తులు పాడవుతాయి. దాని జీవిత కాలం 7 నుండి 9 సంవత్సరాలు. అలాంటి జాగిలాలే మీ నుండి ఏమి ఆశించకుండా ఆ జాగిలాలు మీ రక్షణలో



భాగ్యమైనపుడు మనుషులమైన మనం ఖచ్చితంగా మంచి ప్రవర్తనను కలిగి ఉండాలి ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు జిల్లా అదనపు ఎస్పీ జె. వి.సంతోష్ ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ వి.సత్తిరాజు ,ఏఆర్ డిఎస్పీ జి.మహాత్మా గాంధీ వెల్ఫేర్ ఆర్ ఐ ఎల్ గోపినాథ్ ఏ ఎన్ ఎస్ ఆర్ ఐ. యువరాజ్ ఎం టి ఆర్ ఐ కృష్ణ ,అడ్మిన్ ఆర్ ఐ యం.రాజా ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## ఎన్.సి.సి.పి.ఎ నూతన అధ్యక్షుడుగా నిమ్మగడ్డ నాగేశ్వరరావు

**గుంటూరు మేజర్ న్యూస్:** నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్, ( ఎన్.సి.సి.పి.ఎ )ఆంధ్రప్రదేశ్ శాఖ నూతనంగా ఏర్పాటైంది. శనివారం గుంటూరు బ్రాడిపేట లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో పదమూడు కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు సమావేశమయ్యి, రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్ గా నిమ్మగడ్డ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్స్ గా ఎ. చిట్టిబాబు, సి. హెచ్. నరసింహమూర్తి, పి. గోపాలకృష్ణ, టి.ఆర్. ప్రభాకరరావు జనరల్ సెక్రటరీ గా కె. సుభాష్ చంద్ర బోస్, అసిస్టెంట్ సెక్రటరీలు గా గుమ్మడి సీతారామయ్య చౌదరి, కె. చంద్రశేఖర్, టి. నాగేశ్వరరావు, ఎం. వెంకటేశ్వరరావు, ఎ. శ్రీరంగనాథ్ ట్రెజరర్ గా ఇ. భానుబాబు, అసిస్టెంట్ ట్రెజరర్ గా బి. చంద్రశేఖరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి. మహేశ్వరరావు, తురగా సూర్యరావు, బి.ఎన్.మిత్ర, వి. వి. రమణరాజు ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గాన్ని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పెన్షనర్లు అభినందించారు.

## నేడు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



**గుంటూరు, మేజర్ న్యూస్ :** కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు" "ది రాజోలు తాలూకా తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం - రాజోలు " సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉపకార వేతనం అందజేస్తున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగిష్ శనివారం తెలిపారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 280 మంది పేద విద్యార్థులకు పదకొండు లక్షల నలభై ఐదు వేల రూపాయలు ఉపకార వేతనాలు గా పంపిణీ చేయనున్నారు. ఇందులో ఐదు లక్షల ముప్పై వేల రూపాయలు తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం శివకోడు లోని మంగెన గంగయ్య తెలగ కళ్యాణ మండపంలో ఉదయం ఉదయం 8గంటలకు ప్రారంభమౌతుంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యి వితరణ చేయనున్నారు అని తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలియజేశారు.

## ప్రత్తిపాడు ఎన్ జి ఓ కార్యాలయానికి స్థలం కేటాయించాలని వినతి

**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్:** ప్రత్తిపాడు ఎన్ జి ఓ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా మర్యాదపూర్వకంగా గౌరవ ప్రత్తిపాడు శాసనసభ్యులు డా.బి. రామాంజనేయులును కలిసి వారికి శాలువ మరియు పుష్పగుచ్చములతో సన్మానించారు ఎన్ జి ఓ అసోసియేషన్ సభ్యులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ జి ఓ అసోసియేషనకు ప్రత్తిపాడు ఎండిఓ ఆఫీస్ పరిధిలో స్థలం కేటాయిస్తే ఎంప్లాయిస్ వెల్ఫేర్ కు ఉపయోగపడుతుంది అని ఎన్జీవో తాలూకా అధ్యక్షులు కే.శేషగిరి రాజుఎమ్మెల్యే కు విన్నపించారు.ఇంకా సచివాలయంలోని ఉద్యోగుల సమస్యలపై వివరములు విన్నపించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి జి పాల్ ప్రసాద్, కోశాధికారి జి నాగేశ్వరరావు, సిహెచ్. శ్రీనివాసరావు అధికారులు ప్పాల్గొన్నారు

# రాజయ్యపేట వెళ్లేందుకు హైకోర్టు అనుమతి



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** బల్క్ డ్రగ్ పార్క్ కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల్లో పాల్గొనేందుకు ఈ నెల 27న బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ రాజయ్యపేటకు వెళ్లనున్నారు. ఈ మేరకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పూర్తి స్థాయి అనుతిని ఇచ్చింది. అలాగే రామచంద్రయాదవ్ పర్యటనకు భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఎన్నో అవరోధాలు, అవాంతరాలు దాటుకొని రామచంద్రయాదవ్ రాజయ్యపేటకు వెళ్లనుండటంతో ఆ ప్రాంత మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 5న రాజయ్యపేటకు వెళ్లేందుకు రామచంద్రయాదవ్ రాజమండ్రికి చేరుకోగా పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు. ఆయన బస చేసిన హెూటల్ ను దిగ్బంధించి బయటికి రానీయకుండా ఆంక్షలు విధించారు. దీంతో ఆయన కోర్టు అనుమతి తీసుకొని మళ్లీ వస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం హైకోర్టు అనుమతితో ఈ నెల 12న రాజయ్యపేట పర్యటన కోసం వైజాగ్ కు చేరుకున్నారు. అయితే అంతకు ముందే ఆయన ఢిల్లీలో ఉంటే ఢిల్లీకి వెళ్లి మరీ ఎపి పోలీసులు ఆయన పర్యటనకు అనుమతి లేదని నోటీసులు ఇచ్చారు. వైజాగ్ హెూటల్ లో ఉన్న ఆయన్ని పోలీసులు నిర్బంధించారు. భారీ ఎత్తున పోలీసులు వచ్చి రామచంద్రయాదవ్ ను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రయాదవ్ కాలికి గాయం కూడా అయింది. ఆ తరువాత పోలీసుల ఆంక్షలతో పూర్తి స్థాయి కోర్టు అనుమతితో మళ్లీ వస్తానంటూ రామచంద్రయాదవ్, ప్రకటించారు. అయితే రామచంద్రయాదవ్ ను తమ గ్రామంలోకి ఎందుకు రానివ్వడం లేదంటూ రాజయ్యపేట గ్రామస్తులు, మత్స్యకారులు ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై బైఠాయించారు. రామచంద్రయాదవ్ ను తమ గ్రామంలోకి తీసుకువచ్చేంత వరకు కదలమంటూ భీష్మించుకు కూర్చుకున్నారు. మత్స్యకారులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే రామచంద్రయాదవ్ ఇచ్చిన మాట ప్రకారం పూర్తి స్థాయి హైకోర్టు అనుమతితో ఈ నెల 27న రాజయ్యపేటకు వెళ్లనున్నారు. అందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో రాజయ్యపేట గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ రోజు ఆయన అక్కడి గ్రామస్తులు, మత్స్యకారులు, రైతులతో భేటీ అవుతారు.

## వాహనాలను తనిఖీ చేసిన వెస్ట్ డిఎస్

**గుంటూరు క్రైమ్ మెజర్ న్యూస్:** గుంటూరు వెస్ట్ పరిధిలో గల అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధి అమరావతి రోడ్డు, నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధి చుట్టుగుంట సెంటర్, పట్టాపురం పోలీస్ స్టేషన్ పరిధి బృందావన్ గార్డెన్ సెంటర్ ఏరియాలలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. సరైన డాక్యుమెంట్స్ లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు వెస్ట్ డిఎస్పి కె. అరవింద్ తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ వాహన దారులు ప్రతి ఒక్కరూ వాహనాలు సంబంధించిన కాగితాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అలా ఇచ్చినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

# పీపీపీపై అసత్య ప్రచారాలు ఆపండి

**గుంటూరు, విద్య మేజర్ న్యూస్:** రాష్ట్ర ఆరోగ్య శాఖామాత్యులు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ అంటే ప్రైవేటీకరణ కాదని, ప్రభుత్వం వద్ద తగిన నిధులు లేకపోవడం వలన కార్పొరేట్ వైద్య సంస్థలను ఆహ్వానిస్తున్నామని, పీపీపీ తో మెడికల్ సీట్లు పెరుగుతాయని చెబుతున్న అవాస్తవాలను ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈనెల 25వ తేదీన సాయంత్రం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డా.ఆలా వెంకటేశ్వర్లు తో పాటు కో కన్వీనర్లు కె.ఎస్.లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కొరివి వినయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానం మేరకు గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన జీవో నెంబర్ 107,108 లను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కో కన్వీనర్, శాసనమండలి మాజీ సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వివరిస్తూ జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలకు వాస్తవాలను తెలియజేయడానికి 24 పేజీల పుస్తకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని, రాష్ట్రవ్యాప్తంగా 100మంది మేధావులతో ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను రూపొందిస్తున్నామని, త్వరలో రాష్ట్ర గవర్నర్ ని కలిసి ప్రభుత్వ మెడికల్



కళాశాలలను పరిరక్షించుకోవాల్సిన అవశ్యకతను వివరిస్తామన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో 26 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన విశ్రాంత ఐఏఎస్ అధికారిణి కె. సుజాత, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ అధ్యక్షులుగా, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులుగా కృషి చేస్తున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డా.కె. శ్రీనాథ్ రెడ్డిల పేర్లను పరిశీలించాలని కోరారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు గాను ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ మీడియా సమావేశంలో జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి తెనాలి జాన్ బాబు, కోశాధికారి గోరంట్ల వెంకట్రావు, లంబాడి హక్కుల పోరాట సమితి నేత డి.చంద్రా నాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# వెల్దుర్తికి సీఎం చంద్రబాబు, లోకేష్‌ల రాక..!

## ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాలి



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పెద్ద కుమారుడు జూలకంటి గౌతమ్ రెడ్డి తేజస్వినిల వివాహ రిసెప్షన్ కార్యక్రమం ఈనెల 27న వెల్దుర్తిలో ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, హాజరుకానుండటంతో, అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకొని శనివారం పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్దుర్తిని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యంగా హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి, భద్రతా సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు. సిఎం రాక సమయంలో ఎటువంటి అంతరాయం లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.

# పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి


**తెనాలి, మేజర్ న్యూస్ :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక ఎన్సీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రీ టౌన్ సీఐ సాంబశివరావు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. యుక్త వయస్సులోనే దేశ సేవ చేయాలన్న తపన ఉండాలన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. వ్యాస రచన పోటీల్లో 8,9,10 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో సీఐ సాంబశివరావు సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం శనివారం నిర్వహించారు. విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పేకాట, వ్యభిచారం నిర్వహణ వంటి వాటిని అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. వార్డులలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలన్నారు. అనంతరం ఆయన ఆటో డ్రైవర్లకు



కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్లపై ఆటోలు నిలపవద్దని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. నిబంధనల మేరకు నడవుకోవాలని హెచ్చరించారు.

## 28 న వైసీపీ నిరసన ర్యాలీ జయప్రదం చేయండి

**తెనాలి, మేజర్ న్యూస్ :** మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఈ నెల 28 న తలపెట్టిన వైసీపీ ప్రజా ఉద్యమ నిరసన ర్యాలీ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు మాజీ సీఎం జగన్ ఎనలేని కృషి చేశారన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు జగన్ నాంది పలికారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఓర్వలేకనే మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసన ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## అనారోగ్యంతో బాధపడుతున్న రోగికి ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** దుగ్గిరాల మండల పరిధిలోని మంచి క లపూడి గ్రామానికి చెందిన యార్లగడ్డ బుల్లెమ్మకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని మంజూరు చేశారు .అనారోగ్యంతో బాధపడుతున్న బుల్లెమ్మకి మంత్రి నారా లోకేష్ చొరవతో చెక్కును పార్టీ అధ్యక్షులు శ్రీ అనిత, కే .వాసు బాబు, కే వీరయ్య, యార్లగడ్డ లీల శంకర్ కు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

# మెగా డీఎస్సీ- 2025 ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి



**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లాలోని 18 మండలాల్లోని మాస్టర్ ట్రైనీస్ కు టీచ్ టూల్ రిఫ్రెష్ ట్రైనింగ్ గుంటూరులోని సెయింట్ జోసెఫ్ బిఈడి కళాశాలలో 24, 25 తేదీలలో జరిగినది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ తోట వీరయ్య మాట్లాడుతూ ఈ శిక్షణకు ప్రతి మండలం నుండి ఇద్దరు చొప్పున మాస్టర్ ట్రైనర్ రావడం జరిగిందని వారు వారి వారి మండలాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు విద్యాబోధనలో నూతనంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పాఠశాలల్లో విద్యా బోధన చేసేందుకు దోహదపడుతుందని అన్నారు గుంటూరు జిల్లా ఏ ఎం ఓ రమ్యశ్రీ మాట్లాడుతూ మెగా డీఎస్సీ 2025 ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్లే వె ద్వారా విద్యా బోధన చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో కే సత్యనారాయణ, టీ నగేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## డాడ్జిబాల్ ఛాంపియన్షిప్‌కు ఎంపికైన ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ -జూనియర్ అంతర్ జిల్లాల పోటీలలో స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి "యల్. యుగంధర్" పాల్గొని జిల్లా టీమ్ ద్వితీయ స్థానము సాధించుటలో కృషి చేసి పల్నాడు జిల్లా తరుపున "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ -జూనియర్ డాడ్జిబాల్ టీముకి" ఎంపికై గుజరాత్ రాష్ట్రంలోని, పాట్నా జిల్లా గవర్నమెంట్ స్కూల్ నందు 14-11-2025 వ తేదీ నుండి 17-11-2025వ తేదీ వరకు జరుగబోవు 10వ సబ్-జూనియర్ నేషనల్ డాడ్జిబాల్ ఛాంపియన్షిప్ 2025-26లొ పాల్గొన బోవుచున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. యమ్. యస్. సుధీర్ ఒక ప్రకటనలో తెలిపినారు కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థి యల్. యుగంధర్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన శుభ సందర్భముగా కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మరియు మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా , జాయింట్ సెక్రెటరీ ఊటుకూరి వెంకట అప్పారావు , పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. పి. శ్రీనివాస సాయి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్. యక్కల మధుసూదనరావు , కళాశాల అధ్యాపక అధ్యాపకేతార సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు తమ అభినందనలు తెలిపినారు.



## భారీ వర్షాలు ఉన్నాయి జాగ్రత్తగా ఉండండి

**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్:** మంతా తుఫాను అలెర్ట్ సందర్భంగా తహసీల్దార్ హేనప్రియ శనివారం రాత్రి పెదనందిపాడు లోని నల్లమడ కాలువ కట్ట ను సందర్శించి అక్కడ నివసిస్తున్న వారికి ప్రకృతి విపత్తు సమయములో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. తహసీల్దార్ వారి కార్యాలయం నందు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఎటువంటి సహాయ సహకారాలు కావలసిన కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేయవలసినదిగా వారికి వివరించారు. అనంతరం నల్లమడ వాగు ప్రవాహమును పరిశీలించి నారు. ఆమె వెంట డెప్యూటీ తహసీల్దార్ కరీముల్లా, కార్యాలయ సిబ్బంది, వి ఆర్ ఓ తదితరులు ఉన్నారు.

## ఫుట్‌బాల్ జట్టు ఎంపికల్లో ఐడిపిఎస్ విద్యార్థులు ప్రతిభ

**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట కోటప్పకొండలోని జడ్పీ హెచ్ స్కూల్‌లో 24-10-2025న నిర్వహించిన అండర్%-%14, అండర్%-%17 బాలుర ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపికల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నరసరావుపేట విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు అండర్ 14 విభాగం నుంచి రామ్ సాయి రెడ్డి గ్రేడ్ 8, హేమంత్ 8, నౌషద్ 8, అఖిలాష్ 8, మను సిద్ధార్థ 9, వర్ధన్ 8, వరుణ్ 8 రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు అండర్ 17 విభాగం నుంచి రాఘవరెడ్డి గ్రేడ్ 10అఖిలేష్ 10, అక్బర్ అలీ 9 మంజునాథ్ 9 అర్హత సాధించారు ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు , డైరెక్టర్ నాగోతు సబిత , ప్రిన్సిపాల్ రేఖా పులేకర్ పల్నాడు డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎన్ సురేష్ కుమార్ కోచ్ జె. శివ శంకర్ ని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు క్రీడలు విద్యార్థులను శారీరకంగా మరియు మానసికంగా దృఢంగా తయారుచేస్తాయని, విద్యతోపాటు క్రీడలకు ఐ డి పి ఎస్ పూర్తి స్థాయి ప్రోత్సాహం అందిస్తుందని చైర్మన్ డాక్టర్ ప్రకాష్ తెలిపారు ఈ కార్యక్రమంలో కోచ్‌లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఇండస్ట్రియల్ విజిట్ చేసిన హైస్కూల్ విద్యార్థులు






**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా పెద్దకూరపాడు మండలం 75త్యాళ్ళూరు పీఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 80 మంది విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్లో భాగంగా అమరావతిలోని మహీంద్రా ట్రాక్టర్ షో రూంను సందర్శించారు. షోరూం మేనేజర్ విద్యార్థులకు ఆటోమొబైల్ డెవలప్,వెహికల్ మెకానిజం గురించి వివరించారు. విద్యార్థులు వీటిని చాలా ఆసక్తికరం గా విన్నారు. భవిష్యత్తులో ఇలాంటి విజిట్స్ కు తమ సహకారం ఉంటుందని షోరూం యాజమాన్యం తెలియజేశారు. ఈ ఇండస్ట్రియల్ విజిట్ లో ఒకేషనల్ ఆటోమోటివ్ టీచర్ ఎన్.సునీత,ఒకేషనల్ బ్యాంకింగ్ టీచర్ ఖానిదా,పీడి శ్రీరామకృష్ణ పాల్గొన్నారు. ఇలాంటి ఇండస్ట్రియల్ విజిట్లు వలన విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్పీరియన్స్ తోపాటు,సబ్జెక్టు మీద అవగాహన కలుగుతుందని ఒకేషనల్ టీచర్స్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇన్చార్జి హెచ్ఎం ఖలీలుల్లా బయాలజీ ఉపాధ్యాయుడు విజయ భాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు. లెవెల్ 1 లెవెల్ 2 కు చెందిన 80 మంది విద్యార్థులు విజిట్లో పాల్గొన్నారు.



## రూ. 57.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం

**తెనాలి, మేజర్ న్యూస్ :** పట్టణంలోని పలు వార్డుల్లో సిసి రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక శనివారం శంకుస్థాపన చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని 5,6,8,10వ వార్డులలో పనులకు రూ. 57.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ అప్పలనాయుడు, కౌన్సిలర్ కొత్రపాటి లక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, డిఈ శ్రీనివాసులు, ఏఈ సునీల్ కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ చేయూత

**వినుకొండ మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ జన్మదిన సందర్భంగా వారి కుమారుల సహకారంతో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, శివయ్య స్తూపం సెంటర్ లతో పాటు పలు కూడలిలో యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ చేయూత శుక్రవారం రాత్రి నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణి చేసారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు పమిడిపల్లి అనిల్ రాజ్, మేడం అశోక్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు మనోహర్ బాబు, జాయింట్ సెక్రటరీ కడియం సునీల్, సభ్యులు రత్నం రాజు, దూల్లిపాళ్ళ శ్రీను, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



## ఉద్యానవన సెంటర్ ను సందర్శించిన కలెక్టర్

**నరసరావుపేట మేజర్ న్యూస్:** నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామం నందు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించుచున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు (కూరగాయలు మరియు సుగంధ ద్రవాలు) ను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సందర్శించారు. సందర్శనలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (కూరగాయలు మరియు సుగంధ ద్రవాలు) నందు నిర్మాణంలో ఉన్న వివిధ పనుల యొక్క పురోగతిని పరిశీలించారు. జిల్లా ఉద్యాన అధికారి వెంకట్రావు నిర్మాణంలో ఉన్న వివిధ పనుల యొక్క పురోగతిని కలెక్టర్ కి వివరించారు. తదుపరి ఈ నిర్మాణాలకు సంబంధించిన పురోగతిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసారు. కార్యక్రమంలో షేక్. నబి రసూల్, ఉద్యాన అధికారి, నరసరావుపేట, మండల రెవెన్యూ ఆఫీసర్, ఎంపీడీవో, కాంట్రాక్టర్ పాల్గొన్నారు .

## వర్షాలు వల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి నకరికల్లు కరెంటు ఏఈ సుచరిత

**నకరికల్లు మేజర్ న్యూస్:** కొన్ని రోజుల నుండి వర్షాలు పడటం వల్ల విద్యుత్ శాఖ ప్రజలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ కొన్ని జాగ్రత్తలు సూచించింది. వర్షాల్లో ఈ జాగ్రత్తలు తీసుకోవాలని తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దు. విద్యుత్ లైన్ కి తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దు. చెట్లు కూడా షాక్ కొడతాయి.. విద్యుత్ లైన్కు చెట్టు కొమ్మలు తగిలితే, సంబంధిత అధికారికి కంప్లైంట్ ఇవ్వాలి. కరెంటుకు సంబంధించిన వస్తువులను తడి చేతులతో ముట్టుకోవద్దు చిన్న పిల్లలు కరెంటు వస్తువుల దగ్గరకు రాకుండా చూసుకోవాలి ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు గాలి దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోవద్దు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసినా, నీటిని ముట్టుకోవద్దు. ప్లగ్ తీసిన తర్వాతే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టుకోవచ్చు. వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, వాటర్ మోటర్స్, కంప్యూటర్ల యొక్క స్విచ్లు ఆఫ్ చెయ్యాలి. లేదంటే వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుందికరెంటు లైన్ కింద సెల్ ఫోన్ మాట్లాడకూడదు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైనా డ్యామేజ్ అయితే, సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లాలిప్రతి కరెంటు వస్తువుకూ ఎర్త్ తప్పనిసరిగా ఉండాలి. లేదంటే కరెంట్ షాక్ ఉంటుందని నకరికల్లు ఏఈ సుచరిత తెలిపారు.



## వాటర్ గ్రిడ్ పనులను పరిశీలించిన కలెక్టర్

**మాచర్ల మేజర్ న్యూస్:** నియోజక వర్గం,రాయవరం గ్రామంలో జరుగుచున్న "వాటర్ గ్రిడ్ " పథకం యొక్క పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ,జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఇంకనూ ప్రాజెక్ట్ కు అనుమతులు ఏమైనా అవసరం ఉన్నచో సంభంధిత అధికారులకు సూచించడం జరుగుతుంది అని తెలియ చేసినారు. పల్నాడు ప్రాంతం లో ఇటువంటి ప్రాజెక్ట్ ఎంతైనా ఉన్నదని, మరియు ఈ ప్రాజెక్ట్ ద్వారా పల్నాడు ప్రాంత ప్రజలకు భవిషత్ లో త్రాగునీటికి సమస్య కు శాశ్వత పారిష్కారం లభిస్తుంది అని జిల్లా కలెక్టర్ తెలియజేసారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిపారుదల శాఖ సి ఈ సత్యనారాయణ ,గ్రామీణ నీటిపారుదల శాఖ అడ్వైసర్ తోట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాచవరం ఆర్యవైశ్య జర్నలిస్టులకు సన్మానం

**మాచవరం, మేజర్ న్యూస్:** జర్నలిస్టులు అంకితభావంతో పనిచేసి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డండి రాకేష్ అన్నారు. శనివారం విజయవాడలో వాసవి ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తున్న వివిధ జిల్లాల ఆర్యవైశ్య జర్నలిస్టుల ఆత్మీయ సంఘటన కార్యక్రమం నిర్వహించారు సందర్భంగా మాచవరం సీనియర్ జర్నలిస్టులు చిటీ ప్రోలు ఆంజనేయులు, కాకరపర్తి రమేష్ లను లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల్లా రామకృష్ణ శాలువాతో ఘనంగా సన్మానించి మెమొంటో ప్రశంసా పత్రం అందజేశారు ఈ సందర్భంగా జర్నలిస్టు రమేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య జర్నలిస్టులను గుర్తించి వారికి సన్మానం చేయడం ఎంతో గొప్ప విశేషం అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి ఆర్యవైశ్య జర్నలిస్టు లు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి



**వినుకొండ మేజర్ న్యూస్:** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించకుండా మెరుగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జిబి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. చీఫ్ విప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో ప్రజల మౌలిక వసతులు కల్పించుటకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలని, ఎవరైనా నిధులు దుర్వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పేదరిక నిర్మూలనలో భాగంగా %౫%4 పథకం ద్వారా అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించి వారిని దత్తత తీసుకుని మార్గదర్శకాలను ఎంపిక చేయాలని చీఫ్ విప్ జీవి ఆదేశించారు. స్థలం ఉండి సొంత ఇల్లు కట్టుకునే ప్రతి ఒక్కరికి పంచాయతీల్లో పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని ఎంపీడీవోలకు సూచించారు. సమావేశంలో బొల్లాపల్లి, ఈపూరు, వినుకొండ, శావల్యాపురం, నూజెండ్ల మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## మంతా తుఫానుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మాచవరం, మేజర్ న్యూస్ : మంతా తుఫాన్ (బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం) కారణంగా రానున్న నాలుగు రోజులు( ది.26.10.2025 నుండి 29.10.2025) ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పల్నాడు జిల్లా కూడా ఆరంజ్ జోన్లో ఉన్నట్లు ప్రకటించబడినందున జిల్లా కలెక్టర్ పల్నాడు వారి ఆదేశములు మరియు భారత వాతావరణ శాఖ వారి హెచ్చరికలు అనుసరించి, మాచవరం మండల పరిధిలోని అన్ని గ్రామముల పరిధిలోని ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉండేందుకు, లోతట్టు ప్రాంతాలు, వాగులు, గుంటలు వర్షాలకు నిండి పొంగే అవకాశం ఉన్నందున అవగాహన కల్పించుట మరియు ఎలక్ట్రికల్ పోల్స్ కు వర్షం టైంలో తాకకుండా ఉండుట గ్రామ సచివాలయ సిబ్బంది ల ద్వారా అవగాహన కల్పించుట కావున మండలంలోని ప్రజలు అవసరమైతేనే తప్ప ఇల్లల్లో నుండి బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు తరలించుట ,సురక్షితముగా ఉండవలసిందిగా తెలియజేస్తున్నారు. తహసీల్దార్ వారి కార్యాలయము, మాచవరం నందు మండల తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనది. కంట్రోల్ రూమ్ కాంటాక్ట్ నెంబర్: 7093965985 ఏర్పాటు చేయడమైనది అని తాసిల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి అన్నారు.

# వైద్య కళాశాల ప్రైవేటీకరణ దారుణం



**సత్తెనపల్లి , మేజర్ న్యూస్ :** పేద వర్గాలకు ఉపయోగపడే ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేయటం దారుణమని , ఆయా వర్గాలకు వైద్య విద్యను దూరం చేయడమేనని వైయస్సార్సీపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని దీపాల దిన్నెల పాలెం గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూరల్ మండల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి వై ద్యకళాశాల విషయంలో కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మారుపల్లి రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి చిలకా జైపాల్, వీరాంజనేయులు, పాటిబండ్లకు గోపి, శ్రీధర్, రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో స్ఫూర్తి నింపనున్న సర్దార్ @150 యూనిటీ మార్చ్

## 31న గుంటూరులో సర్దార్ @150 ఐక్యత జిల్లా స్థాయి పాదయాత్ర




**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** సర్దార్ @150 యూనిటీ మార్చ్ యువతలో స్ఫూర్తి నింపనున్నదని మేరా యువ భారత్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ దాస్ ప్రసాద్ అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ గుంటూరు శనివారం మేరా యువ భారత్ కార్యాలయం లో ఈ నెల 31న గుంటూరులో నిర్వహించనున్న సర్దార్ @150 ఐక్యత జిల్లా స్థాయి పాదయాత్ర పై విలేకరులు సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమం లో మై భారత్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ దాస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని స్మరించుకోవడానికి సర్దార్ @150 యూనిటీ మార్చ్ మేరా యువ భారత్ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు, విభజిత భారతాన్ని ఏకతా సూత్రంలో కట్టిన సర్దార్ పటేల్ నాయకత్వ ఆదర్శాలను **"ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్"** గా యువత తమ జీవన విధానంలో అనుసరించమని ప్రేరేపించడం ఈ కార్యక్రమ లక్ష్యం అని ఆయన అన్నారు. ఈ యూనిటీ మార్చ్ కార్యక్రమంలో యువత, విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మేరా యువ భారత్ గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ సర్దార్ @150 యూనిటీ మార్చ్ మై భారత్ గుంటూరు, జిల్లా పరిపాలన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31 ఉదయం 9 గంటలు జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ నుంచి ప్రారంభమై గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజ్ వరకు జరగనున్నదని తెలిపారు. అలాగే అక్టోబర్ 6న, కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవియా, మై భారత్ పోర్టల్ ద్వారా ప్రారంభించిన సర్దార్ @150 యూనిటీ కాంపెయిన్ లో భాగముగా సోషల్ మీడియా రీల్ పోటీ, నిబంధ రచనా పోటీ సర్దార్ @150 యువ నాయకుల కార్యక్రమం లో పాల్గొని ఎంపికైన 150 మంది విజేతలుకు, జాతీయ పాదయాత్రలో పాల్గొనే అవకాశం కలుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎన్ ఎస్ ఎస్ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. బి జె పి జిల్లా ప్రధాన కార్యదర్శి భాజరంజీత్ రామ కృష్ణ మాట్లాడుతూ యువత ఈ చారిత్రక కార్యక్రమంలో భాగస్వాములై, ఏకతా - ఆత్మనిర్భర్ - వికసిత్ భారత్ సాధనలో తమ స్ఫూర్తిదాయక పాత్రను చాటుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎన్ ఎస్ ఎస్ గుంటూరు జిల్లా నోడల్ ఆఫీసర్ డా.జె వి సుధీర్ కుమార్, మై భారత్ గుంటూరు అకౌంటెంట్, ప్రొగ్రమ్మెసిస్టెంట్ వి.పృథ్వీ పాల్గొన్నారు.

# 30న మెగా జాబ్ మేళ

## కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా




**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్ద ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు శనివారం జాబ్ మేళా పోస్టర్ ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. 30వ తేది ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పొన్నూరు రోడ్ లో ఉన్న ఆంధ్రా ముస్లిం కళాశాల ప్రాంగణంలో జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తున్నదని అన్నారు. దాదాపు 30 కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 935 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ఉన్న యువతి యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు మహ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెగా జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి బి.టెక్ వరకు విద్యార్హత కలిగినవారు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో ఎక్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైమరి యా హెల్త్ కేర్, నివారా హెూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వంటి పలు రకాల కంపెనీ లు హాజరవుతున్నాయని తెలిపారు. విద్యార్హత, ఉద్యోగం అనుసరించి రూ.10 వేల నుండి 30 వేల వరకు ఉంటుందని చెప్పారు. ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఫార్మసి, పి.జి విభాగాల్లో విద్యార్హత ఉన్న 18-25 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతి యువకులు బయోడే టా లేదా రెస్యూమ్, విద్యార్హత సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూ కు హాజరు కావచ్చని వివరించారు. వివరాలకు డి. నరేష్ (98663 66187), రామకృష్ణా రెడ్డి (7731982861), ఎన్. కృపానందం (9581794605), టోల్ ఫ్రీ నంబర్: 9988853335, 8712655686, 8790118349, 8790117279 ఫోన్ నంబర్లకు సంప్ర దించవచ్చని అన్నారు. ఔత్సాహిక యువతి యువకులు ముందుగా https://naipunyam.ap.gov.in అనే వెబ్ సైట్ లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయకుండా ఉన్న యువతీ యువకులు జాబ్ మేళా జరుగు ప్రదేశంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రములో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు యు.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూలు నూరు శాతం ఏవిధంగా చూడండి : మేయర్ రవీంద్ర



**గుంటూరు మేజర్ న్యూస్ :** నగరాభివృద్దిలో ఆస్తిపన్ను వసూళ్లు కీలకమని, ప్రతి వార్డు సచివాలయం పరిధిలో బకాయిలు మరియు ప్రస్తుత పన్ను నూరు శాతం వసూళ్లు చేసేలా అడ్మిన్ కార్యదర్శులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, అధికారులు కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రెవెన్యూ వసూళ్లపై నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో మేయర్ పాల్గొన్నారు. సమావేశంలో పన్ను వసూళ్లలో జీరో శాతంగా ఉన్న 25 మంది అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కమిషనర్ ని కమిషనర్ ఆదేశించారు. మేయర్ మాట్లాడుతూ, నగరంలో విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధి పనులకు పన్ను వసూళ్లు అతి ముఖ్యమని రెవెన్యూ విభాగ సిబ్బంది, అధికారులు పన్ను వసూళ్ళను భాధ్యతగా భావించాలన్నారు. పన్ను బకాయిదారులు కూడా సకాలంలో పన్ను చెల్లించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. వార్డ్ సచివాలయాల్లో మౌలిక వసతులైన ఇంటర్ నెట్, ఫర్నీచర్, పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత వార్డ్ సచివాలయాల వారీగా ఉన్న అసెస్మెంట్లు, బకాయిలు, రోజువారీ వసూళ్లు చేయాల్సిన లక్ష్యంపై సమీక్షించి, పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, మాట్లాడుతూ, రోజువారీ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా చేయాల్సిన పన్ను వసూళ్లలో జీరో శాతంతో ఉన్న 25 మంది అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కమిషనర్ ని ఆదేశించారు. సదరు కార్యదర్శులు వచ్చే వారం జరిగే సమీక్షా సమావేశం నాటికి పన్ను వసూళ్లలో పురోగతి చూపించకుంటే విధుల నుండి సస్పెండ్ వంటి కఠిన చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే రెండో అర్ధ సంవత్సరం వచ్చినప్పటికీ ఆస్తి, ఖాళీ స్థల, త్రాగునీటి, మీటర్ల చార్జీలు వసూళ్లలో అలసత్వం వీడకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలకు పన్ను చెల్లింపుపై నోటీసులు ఇవ్వడం, స్పందించకుంటే ట్యాప్, డ్రైనేజి కనెక్షన్ లు డిస్ కనెక్షన్ చేయడం, రెడ్ నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పన్ను వసూళ్లపై డిప్యూటీ కమిషనర్లు మరింతగా క్షేత్ర స్థాయిలో పాల్గొనాలని, అధిక మొత్తం బకాయిదారులను నేరుగా కలవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రవికిరణ్ రెడ్డి, మదన్ గోపాల్, రెహ్మాన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వైసిపి ఆధ్వర్యంలో మల్లవరంలో "రచ్చబండ"



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గం గుంటూరు మండలం మల్లవరం గ్రామంలో శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా **"రచ్చబండ"** కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వై.యస్.ఆర్ సీ.పీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ, గ్రామ కమిటీల నియామకాలను పూర్తి చేశారు. కార్యక్రమంలో, ప్రత్తిపాడు మరియు తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్, గుంటూరు రూరల్ మండల మరియు మల్లవరం గ్రామ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనలో అలసత్వం వద్దు

## కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** లక్ష్య సాధనలో అలసత్వం వద్దని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రతీ స్థాయిలో పూర్తి సామర్థ్యంతో పని చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల నమోదు మెరుగు పడాలన్నారు. ఏ.బి.హెచ్.ఏ పై అవగాహన కల్పించాలని, ఇందుకు గ్రామ సచివాలయం సిబ్బందిని ఉపయోగించాలని ఆదేశించారు. తద్వారా త్వరగా నమోదు చేయాలని అన్నారు. శత శాతం సిజేరియన్ ప్రసవాలు చేస్తున్న ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయాలని, పక్కాగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగకపోవడంపై ప్రశ్నించారు. గర్భిణీలకు వైద్య సేవలు సైతం మెరుగు పరచాలని స్పష్టం చేశారు. రక్త హీనత గల వారిపై పర్యవేక్షణ చేయాలని అన్నారు.

**రానున్న మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి**

భారీ వర్ష సూచన దృష్ట్యా ఈ నెల 27, 28, 29 మూడు రోజుల పాటు పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. రిస్క్ ఉన్న గర్భిణీలు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, వృద్ధులు వంటి వారికి తక్షణం వైద్య సహాయం అందే ప్రదేశాలకు తరలించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తే అచ్చట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ లు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి మాట్లాడుతూ అభా (ఏ.బి.హెచ్.ఏ) ఐడి నమోదులో రాష్ట్రంలో మూడవ స్థానంలో ఉన్నామన్నారు. హై రిస్క్ గర్భిణీలు గా 3,477 మందిని గుర్తించామని, వారికి తగిన వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. జ్వరాల సర్వే జరుగుతోందని చెప్పారు. ఈ సమావేశంలో తెనాలి డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ అన్నపూర్ణ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నీటి పథకాల మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలి



## కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** నీటి పథకాలు ముఖ్యంగా సి.పి.డబ్ల్యూ నీటి పథకాల మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో గ్రామీణ నీటి సరఫరా పథకాలపై కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటి పథకం సమర్ధవంతంగా పని చేయాలని, అందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సి.పి.డబ్ల్యూ నీటి పథకాల మరమ్మతులకు ప్రతిపాదనలు జిల్లా పరిషత్ కు పంపించాలని సూచించారు. స్లో సాండ్ ఫిల్టర్లు ఏర్పాటుకు ప్రాధాన్యత మేరకు గుర్తించి అంచనాలు సమర్పించాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జల జీవన్ మిషన్ (జె.జె.ఎం) క్రింద జిల్లాలో 313 పనులను చేపట్టడం జరుగుతోందని వివరించారు. జె.జె.ఎంలో 62 నీటి వసతుల కల్పన, 97 పంపింగ్, 50 ఓ.హెచ్.ఎస్.ఆర్ లు, 213 డిస్ట్రిబ్యూషన్లు, 240 ఎఫ్.హెచ్.టి.సి లు, 58 ట్రీట్ మెంట్ యూనిట్లు ప్రతిపాదించామన్నారు. ఈ పనులు ఇతర పనులతో అనుసంధానం చేసి చేపట్టడం జరుగుతోందని చెప్పారు. జిల్లాలో 144 తాగు నీటి చెరువులను గుంటూరు చానెల్, కె.డబ్ల్యూ.డి, ఎన్.ఎస్.కెనాల్ ద్వారా నింపుతున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో 44 ఆవాసాలలో 66 ప్రదేశాల్లో లీకేజీలను గుర్తించి అరికట్టడం జరిగిందని చెప్పారు. కొన్ని చోట్ల స్లో సాండ్ ఫిల్టర్లు మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం డిప్యూటీ కార్యనిర్వహక ఇంజనీరింగ్ అధికారులు శివ రామకృష్ణ, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యం లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టండి - జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**పల్నాడు జిల్లా మేజర్ న్యూస్ :** ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అన్నారు. అక్టోబర్ 27 నుండి 29 తేదీ వరకూ భారీ వర్ష సూచనని వాతావరణ శాఖ ప్రకటించారని కలెక్టర్ పేర్కొన్నారు. 27, 28,29 తేదీలు చాలా ముఖ్యమని, 28 అర్ధరాత్రి, లేదా 29 తెల్లవారుజామున సమయం లో ఆంధ్రప్రదేశ్ లో మంతా తుఫాన్ తీరం దాటనున్నదని కలెక్టర్ అన్నారు. 4 రోజులు విస్తృతంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముందస్తు చేపట్టవలసిన చర్యలు దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అధికారులు ముఖ్యంగా జలవనరులు, రెవిన్యూ, పోలీసు,రవాణా, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వ్యవసాయ తదితర శాఖల అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (08647-252999) ఏర్పాటు చేసాము అన్నారు. అలాగే మండల, డివిజన్, స్థాయిలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే లోతట్టు ప్రాంతాల ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు. జనరేటర్లు, త్రాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో దండోరా వేసి ప్రజలకు అప్రమత్తం చేయాలని సూచించారు. నిత్యావసర సరుకుల పంపిణి పై ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆర్ అండ్ బి, ఈపిడిసిఎల్, వైద్య ఆరోగ్య, మత్స్య సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు అప్రమత్తం అవసరమన్నారు. ముంపుకు గురైన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను తుఫాన్ రిలీఫ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలను ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, పాలిచ్చు తల్లులు, చిన్నారులు, వృద్ధులను, వైద్య సహాయం అత్యవసరంగా కావలసిన వారిని ప్రత్యేక శ్రద్ధతో పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అలాగే ఎక్కడైనా రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగితే పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టాలన్నారు. కచ్చా ఇళ్ళు, అంగన్వాడీలు, పాఠశాల భవనాలు పై ప్రత్యేక దృష్టి సారించి సత్వరచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# ఐజిని కలిసిన విశ్రాంత పోలీసు అధికారుల సంఘం



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** విశ్రాంత పోలీసు అధికారుల సంఘం శనివారం రేంజ్ ఐజి సర్వేష్ట త్రిపాఠి ని మర్యాదపూర్వకంగా వారి కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువ తో సత్కరించారు. ఐజి కు రాష్ట్ర విశ్రాంత పోలీసు అధికారుల కార్యక్రమాలను వివిధ జిల్లాల్లో జరిగే సంక్షేమ కార్యక్రమాలు వివరించారు.త్వరలో జరగబోయే రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఐజి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రేంజ్ పరిధిలోని విశ్రాంత పోలీసు అధికారుల సమస్యలను ఏమైనా ఉన్న తన దృష్టికి తీసుకుని వస్తే సంబంధిత ఎస్పీలతో మాట్లాడి సమస్యను త్వరి తగతిన పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అసోసియేషన్ కార్యాలయానికి ఎస్పీగా ఉండంగానే అనుమతి ఇచ్చినందుకు వారికి సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్రాంత అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, సంగం కోశాధికారి విశ్రాంత డిఎస్పి ఈ డాక్టర్ కెవి.నారాయణ, విశ్రాంత ఎస్పీ సంఘం సభ్యులు మేక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కౌశలం సర్వే పూర్తి చేయండి



**పల్నాడు జిల్లా మేజర్ న్యూస్ :** సోమవారం లోగా జిల్లాలో కౌశలం సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వర్క్ ఫ్రమ్ హెూం సర్వే, పీఎం అవాస్ యోజన, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర, సిటిజెన్ ఈకేవైసీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వర్క్ ఫ్రమ్ హెూం ద్వారా నిరుద్యోగులకు ఇంటి వద్దే ఉపాధి కల్పించే అవకాశాలను పరిశీలిస్తోందని, ఆశావహుల సర్వే, ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలు డిసెంబరు 15 నాటికి పూర్తి చేయాలని డ్వామా పీడీని ఆదేశించారు. ఉపాధి కూలీల జాబ్ కార్డుల పునరుద్ధరణ (ఈకేవైసీ) మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణాలు, సుందరీకరణ పనులు లక్ష్యం మేరకు చేయాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సిద్ధలింగ మూర్తి, డీపీఓ నాగేశ్వర్ నాయక్, డీఎల్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

# జెండర్ రిసోర్స్ సెంటర్ ను ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్ జివి



**వినుకొండ మేజర్ న్యూస్ :** నియోజకవర్గం శావల్యాపురం గ్రామంలో జెండర్ రిసోర్స్ సెంటర్ ను ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు శనివారం ప్రారంభించారు.జివి మాట్లాడుతూ, మహిళల అభివృద్ధికి, సమానత్వానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇలాంటి కేంద్రాలు క్షేత్రస్థాయిలో మహిళలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, మహిళా సంఘాల పాల్గొన్నారు.

# ప్రతి పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** వెల్దుర్తి మండల పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో పంటల స్థితిగతులను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా శనివారం పరిశీలించారు. వెల్దుర్తి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, ప్రతి పంటను స్వయంగా పరిశీలించి రైతులతో ముచ్చటించారు. వర్షాల కారణంగా పంటలకు ఎలాంటి నష్టం జరిగిందో అధికారులు సమగ్రంగా అంచనా వేయాలని ఆమె ఆదేశించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వారికి తగు సూచనలు అందించారు. వర్షాల కారణంగా వచ్చే చీడపురుగుల సమస్యలు, నీటి నిల్వలు, దిగుబడిపై ప్రభావం వంటి అంశాలపై కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. అదేవిధంగా పంట నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేసి, తగిన సహాయ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రైతుల ఆదాయం దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# 12 వందలు కంటే అధికంగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ : ఈఆర్ఓ ఓబులేసు



**గుంటూరు మేజర్ న్యూస్ :** కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు 12వందలు కంటే అధికంగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ చేస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఈఆర్ఓ, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, ఇప్పటికే గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 12 వందల మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో గతంలో 291 ఉండగా ప్రస్తుతం మరో 48 కేంద్రాలు కలిపి మొత్తం 339 కేంద్రాలు ఉన్నాయని, తూర్పు నియోజకవర్గంలో గతంలో 256 కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 56 కేంద్రాలు కలిపి మొత్తంగా 312 కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి సూచనలు తీసుకున్నామని, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామాలు మార్పులు ఉంటే వాటిని కూడా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ ఏజంట్లను నియమించుకొని వివరాలను తమకు అందించాలని కోరారు. సమావేశంలో జిఎంసి డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎన్.ఓంకార్ (తెలుగుదేశం), బి.రామకృష్ణ (బిజెపి), డి.జాన్ బాబు (వైఎస్ఆర్సీపీ) సిహెచ్.వాసు, ఎం.శ్యామ్ (బిఎస్పీ), బి. సునీల్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) తాతా సేవా కుమార్ (అమ్ ఆద్మీ పార్టీ), ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.64,36,14,822/- లు జిల్లా గ్రంథాలయ సంస్థ సెస్సు బకాయిలను వెంటనే చెల్లించండి

**గుంటూరు కాలక్టరేట్, మేజర్ న్యూస్ :** ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థకు సంబంధించిన గ్రంథాలయ సెస్సు సమీక్షా సమావేశము డిఆర్ సి హాలు నందు ది. 24-10-2025న సాయంత్రం 4 గంటలకు జరిగినది. ఈ సమావేశమునకు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఛైర్మన్ గా సమీక్షా సమావేశము నిర్వహించినారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కన్వీనర్ గాను, మంగళగిరి నగరపాలక సంస్థ కమీషనర్, గుంటూరు జిల్లా పంచాయితీ అధికారి, తెనాలి కమీషనర్, పొన్నూరు కమీషనర్, బాపట్ల కమీనర్, రేపల్లె కమీషనర్, సత్తెనపల్లి కమీషనర్, పిడుగురాళ్ళ కమీషనర్, మాచర్ల కమీషనర్, చిలకలూరిపేట కమీషనర్, నరసరావుపేట కమీషనర్, వినుకొండ కమీషనర్, గుంటూరు జిల్లా ఆడిట్ అధికారి సభ్యులుగా హాజరైనారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెస్సు బకాయిలను రూ.64,36,14,822/- లు ఉన్నవని, సదరు బకాయిలను ప్రతినెలా రూ.20,00,000/-, రూ.6.10,00,000/- రూ.6.5,00,000/- కమీషనర్లకు మౌఖికంగా ఆదేశాలు జారీచేస్తూ, 2 వారాల తదుపరి చెల్లింపుల విషయమై సమీక్షిస్తామని సదరు సభ్యులకు తెలిపియున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరమునకు ఏ నెలలో వసూలైన సెస్సు మరుసటి నెలలో చెల్లించవలసినదిగా ఆదేశాలు జారీ చేసినారు.

- జీసి అశుతోష్ శ్రీవాస్తవ

# మొంథా తుఫాను ... అప్రమత్తంగా ఉండాలి

## కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



### 0863- 2234014 జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం

**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి సూక్ష్మస్థాయిలో అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి మొంథా తుఫాను ముందుస్తు సహాయక సన్నాహాక చర్యలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సన్నద్ధత ఏర్పాట్లపై సమీక్షించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుఫాను ఈ నెల 28వ తేది సాయంత్రం లేదా రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నారని తెలిపారు. దాని ప్రభావంతో గంటకు 90 నుండి 100 కి.మీ.ల.వేగంతో ఈదురు గాలులు వీయవచ్చని, ఈనెల 26వ తేది ఆదివారం నుండి తుఫాను ప్రభావం కనిపిస్తుందని చెప్పారు. ఈదురు గాలులకు కూలెందుకు అవకాశం ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ వల్ల లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని, కూలిపోయిన చెట్లను తొలగించేందుకు అవసరమైన సామాగ్రిని, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణీలను బాలింతలను దీర్ఘకాలిక రోగులను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా వైద్యానికి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ప్రాథమిక మందులు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. తుఫాను కారణంగా ఎక్కడైనా విద్యుత్ కు అంతరాయం కలిగితే వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిం చేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు, జనరేటర్లు విద్యుత్ శాఖ అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు వారికి, పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజనాలు, పాలు,కూరగాయలు, కొవ్వొత్తులు వంటి అవసరమైన ఇతర నిత్యావసర వస్తువులను తగిన ప్రదేశాలలో పౌర సరఫరాల శాఖ తగినంత మేర అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో సరుకులను అందుబాటులో ఉంచాలన్నారు. సహాయక చర్యలకు అవసరమైన బోట్లు ఇతర వాహనాలను ముందస్తుగానే ప్రాంతాలవారీగా మత్స్య, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో సిద్ధం చేసుకోవాలన్నారు. .అన్ని మండలాల్లోను, మున్సిపాలిటీల్లోను 24 గంటలు పనిచేసేలా వెంటనే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అలాగే పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో అన్ని శాఖల ఉద్యోగులు సిబ్బంది అందుబాటులో ఉండాలే ఆదేశాలు జారీ చేయాలని జిల్లా అధికారులకు స్పష్టం చేశారు.అదే విధంగా తుఫాను ప్రభావంతో రోడ్లపై చెట్లు కూలి రావాణాకు అంతరాయం కలిగితే వెంటనే ఆచెట్ల కొమ్మలను కత్తిరించి చెటల కొమ్మలను తొలగించి రహదారి మార్గాలను పునరుద్ధరించేందుకు సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వసతి గృహాల్లోను విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సంక్షేమ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి, వరి, మిర్చి ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటలకు తుఫాను నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సహాయక చర్యలకు అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు అవసరమైన సామాగ్రి సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో సహాయక చర్యలకు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులను, వాలంటీర్లను, స్థానిక నాయకుల వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులుగా నియమించిన జిల్లా అధికారులు రానున్న నాలుగు రోజులు మండల కేంద్రాల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో సహాయక ముందస్తు సన్నద్ధత ఏర్పాట్లును పర్యవేక్షించాలన్నారు. వరదప్రభావం వలన జరిగే నష్టాలు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై సన్నద్ధత ఏర్పాట్లుపై అన్ని శాఖల అధికారులు సూక్ష్మస్థాయి ప్రణాళికలు రూపొందించి వెంటనే అందించాలన్నారు. మంథా తుఫాను వలన జిల్లాలో ప్రాణనష్టం జరగకుండా, సాధ్యమైనంత వరకు నష్టాలును తగ్గించేలా అధికారులు బాధ్యతగా సన్నద్ధత ఏర్పాట్లు పటిష్టంగా తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహాశీల్దార్లు సహాయక సన్నద్ధత ఏర్పాట్లును క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలి. జిల్లా స్థాయిలోను అన్ని శాఖల అధికారుతో అవసరమైన సహాయం అందించటానికి 0863- 2234014 తో కంట్రోల్ రూం ను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ కమ్యూనికేషన్ సర్వీస్ ప్రోవైడర్ ప్రతినిధులతో మాట్లాడుతూ టెలికమ్యునికేషన్ వ్యవస్థ దెబ్బతింటే సేవలను సకాలంలో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, జిల్లా పరిషత్ సీఈఓ వి జ్యోతిబసు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. రమణ యశస్వి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్రబాబు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, మెప్మాపీడీ విజయలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, మండల స్థాయి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## ఏసీఎంఈ లో ఘనంగా బాస్కెట్ బాల్ పోటీలు




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** గుంటూరు నగర శివారు ఏసిఎంఈ పాఠశాలలో శనివారం ఇంటర్ స్కూల్ ఛాంపియన్ పోటీలు ఘనంగా జరిగాయి. బాలికల విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానం సాధించింది. ఏసీఎంఈ పాఠశాల ద్వితీయ స్థానాన్ని, నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ మూడో స్తానాన్ని కైవసం చేసుకున్నాయి. బాలుర విభాగంలో ఆక్స్ఫర్డ్ స్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, ఏ సి ఎం ఈ, నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ సౌగంద్ కృష్ణ నందమూరి, ప్రిన్సిపల్ దీప్తి నందమూరి బహుమతులను అందజేశారు. క్రీడలు వల్ల మానసిక శారీరిక అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

## మాచర్ల నుండి అరుణాచల దర్శనానికి సూపర్ లగ్జరీ బస్ సర్వీస్

**మాచర్ల మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచర్ల ఆర్టీసీ డిపో నుండి ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం వెళ్లే భక్తుల కోసం సూపర్ లగ్జరీ బస్ సర్వీసు ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరస్వామి తెలిపారు. ప్రతి పౌర్ణమి రోజున ఈ ప్రత్యేక టూర్ సర్వీస్ ఏర్పాటు చేయబడుతుందని ఆయన వివరించారు. ఈ నెల నవంబర్ 3వ తేదీ రాత్రి 7 గంటలకు మాచర్ల బస్టాండ్ నుండి బస్ బయలుదేరనుంది. నవంబర్ 4న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనాలు జరుగుతాయి. తరువాత 5వ తేదీన అరుణాచలం చేరుకుని భక్తులు గిరిప్రదక్షిణ చేసి, అరుణాచలేశ్వరుడి దర్శన భాగ్యం పొందుతారు. అదే రోజు సాయంత్రం తిరుగు ప్రయాణం ప్రారంభమై, నవంబర్ 6వ తేదీ (గురువారం) ఉదయం 8 గంటలకు మాచర్ల చేరుతుందని తెలిపారు. ఈ సర్వీసు కోసం రానుపోను టిక్కెట్ ఛార్జీ ఒక్కొక్కరికి రూ. 2,750 మాత్రమే అని తెలిపారు. మరిన్ని వివరాలకు ఏఎమ్ (టి): 7382801048, డిఎమ్ఇ: 7382895290, డిపో మేనేజర్: 9959225432 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని శ్రీకాళహస్తీశ్వరుడు, కాణిపాకం సిద్ధివినాయకుడు, శ్రీపురం లక్ష్మీ అమ్మవారు మరియు అరుణాచలేశ్వరుడి దర్శన భాగ్యం పొందవలసిందిగా డిపో అధికారులు భక్తులను కోరారు.

## సామాజిక మాధ్యమాలు వినియోగం పై జాగ్రత్తగా వ్యవహరించాలి

### - జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్ :** సామాజిక మాధ్యమాలు, ముఖ్యంగా వాట్సాప్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో సమా చారం / పోస్టులు పెట్టే ముందు లేదా ఫార్వర్డ్ చేసే ముందు ప్రతి ఒక్కరూ ఒకటికి రెండుసార్లు ఆలోచించి, సమాచారపు నిజనిజాలు సరిచూసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వ కంగా అసత్య, నిరాధార సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడం లేదా ఫార్వర్డ్ చేయడం ద్వారా సమాజంలో కల్లోలం సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ రకమైన పోస్టులు ప్రజల్లో విభేదాలు రేకెత్తించే అవకాశం ఉన్నందున, అటువంటి వ్యక్తులను గుర్తించి చట్టపరమైన విచారణ ప్రారంభిస్తామని తెలిపారు. తాము ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపు యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటి? తమ గ్రూపులోని అడ్మిన్ మరియు ఇతర సభ్యుల వివరాలు ? వారు చేస్తున్న పనులు ? గ్రూపులో సభ్యులు పెడుతున్న పోస్టులు వాస్తవమేనా ?, ఆధారాలతో కూడినదేనా ?, వాటి యొక్క ఉద్దేశం ? గ్రూపులోని సభ్యులపై ఏమైనా కేసులు ఉన్నాయా ?, ఉంటే ఎటువంటి కేసులు నమోదు అయినాయి ?, వాటి యొక్క స్థితి ఏమిటి? గ్రూపులో పెడుతున్న పోస్టులు ప్రజలను గాని, రాజకీయ పార్టీలను గాని, కుల మత వర్గాల మధ్య విభేదాలు గానీ, సృష్టించే విధంగా ఉన్నాయా? అనే అంశాలను నిశితంగా పరిశీలించాలని అడ్మిన్లను కోరారు. వాట్సాప్ గ్రూపులో సభ్యులు పోస్ట్ చేసిన కంటెంట్‌కి గ్రూప్ అడ్మిన్ లేదా గ్రూప్ ఏర్పాటు చేసిన వ్యక్తి చట్టపరమైన బాధ్యత వహించవలసి ఉంటుంది. అందు వల్ల గ్రూపులో పోస్టు లేదా ఫార్వర్డ్ చేసే ప్రతి సమాచారం వాస్తవాధారాలతో ఉన్నదని నిర్ధారించుకోవాలి. ప్రజల వ్యక్తిగత గోప్యత, గౌరవం, భావోద్వేగాలు మరియు సామాజిక శాంతిభద్రత దృష్ట్యా సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## దళితుల ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున హాజరవ్వాలని దుడ్డు రామకృష్ణ మాదిగ పిలుపు




**దుర్గి మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలంలో శనివారం యం ఆర్పీ యస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి దుడ్డు రామకృష్ణ మాదిగ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నవంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న దళితుల ఆత్మగౌరవ సభకు పల్నాడు ప్రాంతం నుండి దళితులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.దుర్గిలోని లూథరన్ చర్చ్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, పల్నాడు ప్రాంతంలోని యం ఆర్పీ యస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సభ వివరాలను వివరించారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి రమేష్ మాదిగ అధ్యక్షత వహించారు. యం ఆర్పీ యస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి గారిని కించపరిచిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసే కార్యక్రమం లో భాగంగానే ఈ పర్యటన చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యం ఈ ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు దాసరి నాగయ్య మాదిగ, యం ఎస్ పి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గడ్డిపర్తి శ్రీనివాస రావు మాదిగ, సీనియర్ నాయకులు ఊరే మార్క్ మాదిగ, రెంటచింతల టౌన్ అధ్యక్షుడు తాళ్లూరి మరియబాబు, అల్లి కరుణాకర్, గేరా మల్లయ్య, దుర్గి మండలం నుండి యం ఆర్పీ యస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ముటుకూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**దుర్గి మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం ముటుకూరు గ్రామం యస్సీ మాదిగ కాలనీలో శుక్రవారం వై.ఎస్.ఆర్.సి.పి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో మాదిగ కాలనీలోని ప్రజలు, వై.ఎస్.ఆర్.సి.పి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల నుండి విస్తృత స్పందన లభించింది.